క్లుప్తంగా

నేడు ఆత్మీయ సమ్మేళనం

అచ్చంపేట: భక్త మార్కేండేయ ఆలయ ప్రాంగణంలోని కమ్యూనిటీ హాల్‌లో ఈ నెల 25న ఉదయం 10 గంటలకు విశ్వహిందు పరిషత్ అచ్చంపేట ప్రఖండ ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. హిందు బంధువులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మద్యం తాగి వాహనాలు నడుపొద్దు

నాగర్‌కర్నూల్ క్రైం: మద్యం తాగి వాహనాలు నడుపొద్దని ఎస్‌ఐ ఎస్‌ఐ గోవర్ధన్ హెచ్చరించారు. శనివారం జిల్లా కేంద్రంలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ వాహనదారులు సీట్ బెల్టు, హెల్మెట్‌ను ధరించాలన్నారు. ట్రాఫిక్ ఎస్‌ఐ కల్యాణ్, సిబ్బంది పాల్గొన్నారు.

రుణమాఫీపై దరఖాస్తులు స్వీకరణ

పెద్దకొత్తపల్లి: రుణమాఫీ వర్తించని రైతుల నుంచి శనివారం పలు గ్రామాల్లో దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఏఓ శిరీష మాట్లాడుతూ రైతు వేదికలలో గ్రీవెన్సీ దరఖాస్తుతో పాటు ఆధార్‌కార్డు, భూమి పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు ఖాతా జిరాక్స్‌లను ఏఈఓలకు అందజేయాలని కోరారు. మండల కేంద్రంలో ఉన్న రైతు వేదిక వద్ద ఏఈఓ ముజీబ్ దరఖాస్తులు స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. రైతుల ఇళ్ల వద్దకు అధికారులు వచ్చి పూర్తి విచారణ చేసి అర్హులందరికీ రుణమాఫీ అయ్యేవిధంగా కృషి చేస్తామని పేర్కొన్నారు.

కారు బోల్తా: తప్పిన ప్రమాదం

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రమాదవశాత్తు కారు బోల్తాపడిన ఘటన మండలంలోని వనపట్ల గేటు శివారులో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కొల్లాపూర్ వైపు నుంచి నాగర్‌కర్నూల్ వైపు వేగంగా కారు వస్తూ వనపట్ల గేటు శివారులో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారు ప్రయాణిస్తున్న వారు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఎస్‌ఐ గోవర్ధన్‌ను వివరణ కోరగా ప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని తెలిపారు.

దాతల సహకారం వినియోగించుకోవాలి



కల్వకుర్తిరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు దాతలు అందించిన సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆవోపా అధ్యక్షుడు పాపిశెట్టి సతీష్ గుప్త కోరారు. శనివారం మండలంలోని తోటపల్లి ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులకు రూ.40 వేల విలువ చేసే బ్యాగులను అందజేశారు. అనంతరం సతీష్‌గుప్త మాట్లాడుతూ విద్యాభివృద్ధికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో శోభన్‌బాబు, గౌరయ్య, జంగయ్య, శైలజ పాల్గొన్నారు.

గుండెపోటుతో మాజీ సర్పంచ్ మృతి

కల్వకుర్తిరూరల్: మండలంలోని జీడిపల్లి తండా మాజీ సర్పంచ్ శాంతమ్మ(58) శనివారం గుండెపోటుతో మరణించింది. మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ సమకూర్చిన రూ.5వేలను బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు విజయ్‌గౌడ్ బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు జంగయ్య, మాజీ మార్కెట్ చైర్మన్ బాలయ్య, తాండ్ర ఈశ్వరయ్య పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

తెలకపల్లి: మండలంలోని పెద్దపల్లి గ్రామానికి చెందిన గోద యాదయ్య(28) అదృశ్యమైన ఘటన శనివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ నరేష్ వివరాల ప్రకారం సోదరుడు సురేష్‌తో పొలం విషయంతో యాదయ్య గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. సాయంత్రం వరకు తిరిగి రాకపోవడంతో ఎక్కడ వెతికినా ఆచూకీ తెలువలేదు. దీంతో యాదయ్య తండ్రి మల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో పోచమ్మ బోనాలు



కల్వకుర్తిలో పోతురాజుల విన్యాసాలు



వెల్దండ మండలం రాచూర్‌లో



వంగూరులో బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

కల్వకుర్తిరూరల్: పట్టణంలో పోచమ్మ బోనాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. బాణాసంచా కాల్చుతూ ముందుకు సాగారు. డీజేకు అనుగుణంగా యువకులు నృత్యాలు చేశారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, బీజేపీ రాష్ట్ర నాయకుడు తల్లోజు ఆచారి ఆలయం ప్రత్యేక పూజలు చేశారు. మాజీ సర్పంచ్ ఆనంద్, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, బీజేపీ నాయకులు దుర్గా ప్రసాద్, కృష్ణగౌడ్, రాఘవేందర్‌గౌడ్, రాంభూపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వంగూరు: గెల్వలాంబమాత బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటి రోజు శనివారం వైశ్యులు బోనమెత్తారు. మహిళలు, యువతులు కోలాటాలతో అలరించారు. కోలాటాలు భాజభజంత్రీల ఆలయానికి చేరుకొని నైవేద్యాన్ని అమ్మవారికి సమర్పించారు. ఉదయం అమ్మవారిని శోభాయమానంగా ఊరేగించారు. ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సతీమణి డాక్టర్ అనూరాధ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ చైర్మన్ వెంకటస్వామి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పండిత్‌రావు, రమేష్‌గౌడ్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

వెల్దండ: మండలంలోని రాచూర్‌లో పోచమ్మ బోనాల పండుగ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. గ్రామంలో స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. మహిళలు బోనాలతో ఆలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. మహిళలు పూనకాలు ఊగారు. పలు పార్టీల నాయకులు తదితరులు ఉన్నారు.

అట్టహాసంగా తీజ్ సంబరాలు



కల్వకుర్తి గిరిజన యువతులతో నాయకులు

అచ్చంపేట: పట్టణంలోని గిరిజన భవన్ ఆవరణలో శనివారం 8వ రోజు మహాభోగ్ సేవలాల్ మహారాజ్, దండి మేరమ్మతల్లి పూజలు నిర్వహించారు. అదే విధంగా పట్టణంలోని గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు మూడావత్ రాములునాయక్ ఇంటి వద్ద మట్టితో తయారు చేసిన గౌరి, గౌరిలక్కల అలంకరణ, వెంకటేశ్వరకాలనీ లోని బీష్యనాయక్ ఇంటి నుంచి ఘనగోర్, ఆదర్శనగర్ బాల్‌రాం ఇంటి నుంచి చోడకిలీ గోందుత బుట్టను డప్పులు, సంప్రదాయ నృత్యాలతో ఊరేగింపుగా తీజ్ బుట్టల వద్దకు తీసుకొచ్చారు. పట్టణ వాసులు అధికసంఖ్యలో తరలివచ్చి తీజ్ ఉత్సవాలను తిలకించారు.

కల్వకుర్తిరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని జయ ప్రకాశ్ నగర్ తండాలో తీజ్ వేడుకలు నిర్వహించారు. ఆదివారం ముగింపు కార్యక్రమానికి ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యక్రమంలో ఉత్సవ



కమిటీ నాయకులు హనుమానాయక్, నిరంజన్ నాయక్, మాజీ సర్పంచ్ ఆనంద్, దేవీలాల్, శ్రీను నాయక్, మహిపాల్ నాయక్ పాల్గొన్నారు.

అమ్రాబాద్: పదరమండలం చిట్లంకుంటలో గిరిజనులు తీజ్ ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తీజ్ బుట్టను ఎత్తుకొని సీత్లామాతకు పూజలు నిర్వహించి ఊరేగింపు నిర్వహించి సమీప బావిలో నిమజ్జనం చేశారు. డాక్టర్ అనురాధ పాల్గొని గిరిజనులతో కలిసి సీత్లామాతకు పూజలు నిర్వహించారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



కొండనాగుల కళాశాలవిద్యార్థులతో డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ, ఎస్‌ఐ

బల్మూర్: చెడు వ్యసనాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి అచ్చంపేట డీఎస్పీ శ్రీనివాసులు సూచించారు. మండలంలోని కొండనాగుల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం యాంటీ ర్యాగింగ్, మత్తు పదార్థాలు, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ చెడు అలవాట్లతో జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. సెల్‌ఫోన్ల వాడకాలను తగ్గించాలన్నారు. కార్యక్రమంలో సీఐ రవీందర్, ఎస్‌ఐ గురుస్వామి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమ్రాబాద్: విద్యార్థులకు సైబర్‌నేరాలపై అవగాహన ఉండాలని డీఎస్పీ శ్రీనివాస్ సూచించారు. శనివారం పదర పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం రాయలగండి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి పలు అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థునులు బాగా చదివి ఉన్నత స్థానంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. ఆయన వెంట సీఐ శంకర్ నాయక్, ఎస్‌ఐ రాజు ఉన్నారు.

పండ్లతోటల పెంపకంపై దరఖాస్తుల ఆహ్వానం

వెల్దండ: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన చిన్న, సన్నకారు రైతులందరు పండ్లతోటల పెంపకానికి దరఖాస్తులు చేసుకోవాలని ఏపీఓ ఈశ్వర్‌జీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటివసతి ఉండి తోటలకు అనుకులంగా భూమి ఉంటే రైతులు దరఖాస్తులను చేసుకోవాలన్నారు. ఈనెల 31వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం, బీసీలకు 90 శాతం సబ్సిడీతో డ్రిప్ ఇస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భూసార పరీక్షలపై అవగాహన

వెల్దండ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఏఈఓ గణేష్ భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన భూసార పరీక్షల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. భూమిలో ఉన్న లవణాలు పంటలకు అందించవలసిన పోషకాలను తెలిపారు. నేల యొక్క స్వభావబట్టి పంటలను సాగు చేయాలన్నారు. భూసార పరీక్షలకు కావాల్సిన మట్టి నమూనాలపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యాదగిరి, అమర్‌సింగ్, దానయ్య, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

ఎంపీడీఓ ఆకస్మిక తనిఖీ



ఉప్పునుంతల: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)ని శనివారం ఎంపీడీఓ మోహన్‌లాల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యాలయం పరిసరాలను, వంట గదిని, భోజనాన్ని పరిశీలించారు. వర్షాకాలంలో విద్యార్థినులకు సీజనల్ వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఎంపీఓ నారాయణ, ఈజీఎస్ ఏపీఓ సుదర్శన్‌గౌడ్ పాల్గొన్నారు.

డీసీసీబీ చైర్మన్‌కు సన్మానం

నాగర్‌కర్నూల్‌రూరల్: ఉమ్మడి పాలమూరు జిల్లా డీసీసీబీ చైర్మన్‌గా ఎన్నికైన మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డిని శనివారం నాగర్‌కర్నూల్ జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు సన్మానించారు. జిల్లా కేంద్రంలో డీసీసీబీ కార్యాలయంలో చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కుంభం మల్లేష్‌గౌడ్, సదుర్ల తిరుపతయ్య, కాళ్ల నిరంజన్, కొత్ర శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

వెల్దండ: మండలంలోని రాచూర్ గ్రామానికి చెందిన శెట్టిపల్లి నాగయ్య అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. గ్రామానికి చెందిన పడకంటి వెంకటేష్ రూ.3 వేలు, గున్నేల శ్రీనివాస్ రూ. 5వేలు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు సంజీవ్‌కుమార్ యాదవ్ రూ. 5వేలు బాధిత కుటుంబానికి అందజేశారు.

ప్రత్యేక బస్సు కేటాయించాలని రాస్తారోకో

తాడూరు: మండలంలోని అంతారానికి ప్రత్యేక బస్సు కేటాయించాలని కోరుతూ శనివారం డీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు భరత్ మాట్లాడుతూ ఉచిత బస్సు ప్రయాణం కారణంగా బస్సులలో రద్దీ ఎక్కువగా ఉంటుందని దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని మేడిపూర్ నుంచి ఆకునెల్లికుదురు, అంతారం, ఎటిదారిపల్లి, గోవిందాయిపల్లి, ఐతోల్, బలాన్‌పల్లి గ్రామాలకు ఒకేఒక బస్సు నడుస్తుందని తెలిపారు. విద్యార్థులకు ప్రత్యేక బస్సు నడిపించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న విద్యార్థులు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

తాడూరు: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటదాసు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యాలయంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్టోర్‌రూం, వంటగది, భోజనశాల, హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. కలరా, టైఫాయిడ్, డయేరియా, మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, ఫైలేరియా వంటి వ్యాధుల నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది ఆర్ శ్రీనివాసులు, నరసింహ, ఎస్‌ఓ విజయ, సూపర్‌వైజర్ రజిత, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్

లింగాల: సీజనల్ వ్యాధులు రాకుండా అధికారులు, వైద్యశాఖ ఆధ్వర్యంలో పారిశుద్ధ్యంపై అధికారులు ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహిస్తున్నారు. శనివారం మండలంలోని లింగాల, అప్పాయపల్లి, ఎర్రపెంట, చెన్నంపల్లి, పద్మన్నపల్లి ఆయా శాఖల అధికారులు ఇంటింటికి తిరిగి పరిసరాల పరిశుభ్రతపై, సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఆయిల్ బాల్స్ వేయించడం, దోమల నివారణ మందును



లింగాల మండలం అప్పాయపల్లిలో పరిసరాలను పరిశీలిస్తున్న అధికారులు

పిచికారి చేయించడం, రోడ్లకు ఇరువైపుల, వీధుల వెంట ఉన్న మురుగుపై బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించే పనులు చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆంజనేయులు, ఎంపీఓ చంద్రశేఖర్, వైద్యాధికారి శివశంకర్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఏఎస్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్(బిజినేపల్లి): మండలంలోని మంగనూర్‌లో పారిశుద్ధ్యంపై గ్రామస్తులకు శనివారం ఎంపీడీఓ కతలప్ప అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది యాదగిరి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల



పెంట్లవెల్లి: కేజీబీవీ విద్యాలయంలో నాన్‌టీచింగ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 30న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తునట్లు ఆ సంఘం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌ఎల్ పద్మ పేర్కొన్నారు. శనివారం తెలంగాణ ప్రగతిశీల కేజీబీవీ నాన్‌టీచింగ్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్, మౌనిక, అలివేలు, రజిత, లక్ష్మమ్మ, కనకమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌ఓలకు శిక్షణ

లింగాల: మండలంలోని ఆయా గ్రామాల్లో ఎస్‌ఎస్‌ఆర్–25 అమలులో భాగంగా నిర్వహించే ఓటరు ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ తబితారాణి బీఎల్‌ఓలకు సూచించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం సర్వే నిర్వహణపై బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లకు ఒక రోజు శిక్షణ నిర్వహించారు. కొత్త ఓటరుగా నమోదుకు దరఖాస్తులు స్వీకరించాలన్నారు. క్షేత్రస్థాయిలో సర్వేను సూపర్‌వైజర్లు పర్యవేక్షించాలని తహసీల్దార్ ఆదేశించారు. కార్యక్రమంలో ఎమ్మార్‌ఐ సీతారాంనాయక్, ఏఆర్‌ఐ తిరుపతమ్మ, సతీష్, రమేష్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

మోడల్ హైస్కూల్‌లో బాలసభ

వెల్దండ: మండల కేంద్రంలోని మోడల్ హైస్కూల్ వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు బాలసభ నిర్వహించారు. ఈ సందర్భంగా కోఆర్డినేటర్ జ్యోతి మాట్లాడుతూ సృజనాత్మకతను వెలికితీసేందుకు బాలసభలు ఏర్పాటు చేస్తునట్లు పేర్కొన్నారు. ఆటపాటలు, కథలు, జోక్స్ తదితర పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పుష్పలత, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

క్రీడాపోటీలు ప్రారంభం

పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ బాలుర ఉన్నత పాఠశాలలో గేమ్స్ ఫెడరేషన్ ఇండియా ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలను శనివారం మండల నోడల్ ఆఫీసర్ కురుమయ్య ప్రారంభించారు. కుమారస్వామి, సత్యనారాయణ, విజేందర్‌సింగ్, క్రాంతి పాల్గొన్నారు.

తూడుకుర్తిలో ఆయుర్వేద వైద్య శిబిరం


నాగర్‌కర్నూల్‌రూరల్: మండలంలోని తూడుకుర్తిలో శనివారం ప్రభుత్వ ఆయుర్వేద డిస్పెన్సరీలో నేషనల్ ఆయూష్ మిషన్ ఆధ్వర్యంలో వృద్ధులకు వైద్య శిబిరం నిర్వహించారు. పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ సురేష్, డాక్టర్ మంజూల, ఫార్మసిస్టులు గోవిందు, మురళీకృష్ణ ఉన్నారు.

వృద్ధాశ్రమాన్ని సందర్శించిన జడ్జి



కొల్లాపూర్: పట్టణంలోని విశ్వశాంతి వృద్ధాశ్రమాన్ని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఆర్‌వీఎస్‌ఎస్ మిధున్‌తేజ శనివారం సందర్శించారు. ఆశ్రమంలో వృద్ధులకు కల్పిస్తున్న వసతి, సౌకర్యాల గూర్చి నిర్వాహకులను అడిగి తెలుసుకుననారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఆయన వెంట కోర్టు సూపరింటెండెంట్ బోగా హరికృష్ణ, కోర్టు సిబ్బంది ఉన్నారు.

హిందూ ధర్మాన్ని కాపాడుకుందాం



తెలకపల్లి: హిందూ ధర్మాన్ని కాపాడుకుందామని విశ్వహిందు పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర శర్మ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని యోగా భవనంలో విశ్వహిందూ పరిషత్ తెలకపల్లి ప్రఖండ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందువులు సంఘటితం కావాల్సిన అవసరం ఉందన్నారు. బంగ్లాదేశ్‌లపై హిందువులపై జరుగుతున్న దాడులు, అకృత్యాలు ఖండిద్దామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శివయ్య గౌడ్, సహాయ కార్యదర్శి ఉమాపతిఆచార్యులు, ప్రఖండ అధ్యక్షుడు కిషోర్, కార్యదర్శి శివకృష్ణ, టౌన్ అధ్యక్షుడు రామకృష్ణ, భక్తతుకారాం తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తాం



వెల్దండ: మండలంలోని గుండాల అంబా రామలింగేశ్వరస్వామి దేవాలయాన్ని దాతల సహకారంతో అభివృద్ధి చేస్తామని ఆలయ కమిటీ డైరెక్టర్లు పేర్కొన్నారు. శనివారం దేవాలయంలో కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఆలయంలో భక్తులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై చర్చించారు. అనంతరం ఆలయ ఆవరణలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో కిసాన్‌సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు పర్వత్‌రెడ్డి, డైరెక్టర్లు అంజయ్య, లింగమయ్య, మల్లేష్‌ముదిరాజ్, తిరుపతయ్య, ఆలయ అర్చకుడు నరహరిశర్మ, శివశర్మ, సంతోష్‌శర్మ, సురేష్‌శర్మ, కిషన్ తదితరులు ఉన్నారు.

భక్తి శ్రద్ధలతో వెంకటలక్ష్మమ్మ ఉత్సవాలు

అమ్రాబాద్: మండల కేంద్రంలో గౌడ కులస్తుల ఆరాధ్యదైవం వెంకటలక్ష్మమ్మ ఉత్సవాలు రెండు రోజుల నుంచి భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం మాజీ జెడ్పీటీసీ, సీబీఎం ట్రస్టు చైర్మన్ డాక్టర్ అనురాధ పాల్గొని దేవికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆమెను శాలువాలు కప్పి పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రాజారాంగౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హరినారాయణగౌడ్, రఘు రామాచారి, బాలింగంగౌడ్, సురేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



బల్మూర్: పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఐసీడీఎస్ సీడీపీఓ దమయంతి అన్నారు. శనివారం మండల కేంద్రంలో న్యూ కరికులంపై అంగన్‌వాడీ టీచర్లకు ఒక రోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ, పీహెచ్‌సీ వైద్యాధికారి తారాసింగ్‌లు మాట్లాడుతూ తక్కువ బరువు ఉన్న పిల్లలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నిర్మల, ఆయా అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు పాల్గొన్నారు.

ఇద్దరికి రిమాండ్

లింగాల: అడవి పంది మృతికి కారణమైన మండలంలోని అప్పాయపల్లికి చెందిన బుసనమోని శివరాం, బతికే ఆంజనేయులను రిమాండ్‌కు తరలించినట్లు ఎఫ్‌ఎస్‌ఓ రాంబాబు శనివారం తెలిపారు. ఈ నెల 12న రాత్రి వేళ వారు పంటను రక్షించుకోవడానికి వ్యవసాయ పొలం చుట్టూ విద్యుత్‌సరఫరా అయ్యే విధంగా తీగను అమర్చారు. పొలం వద్ద అడవి పంది తీగకు తగిలి మృతి చెందింది. ఈ ఘటనలో ఇరువురి రైతులను అచ్చంపేట కోర్టులో హాజర్ పర్చగా జడ్జి 14 రోజులు రిమాండ్ విధించింది. ఈ మేరకు వారిని కల్వకుర్తి జైలుకు తరలించినట్లు ఎఫ్‌ఎస్‌ఓ తెలిపారు.

పాఠశాలల్లో కృష్ణాష్టమి సంబరాలు



కల్వకుర్తిలో..



కొల్లాపూర్‌లో..



రాధాకృష్ణ వేషధారణలో పెద్దకొత్తపల్లి చెన్నపురావుపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

సాక్షి, నెట్‌వర్క్: జిల్లాలోని పలు మండలాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. పెద్దకొత్తపల్లి మండలంలోని చెన్నపురావుపల్లి ప్రాథమికోన్నత పాఠశాల, కొల్లాపూర్, కల్వకుర్తి, వెల్దండ ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు రాధాకృష్ణుల వేషధారణలో అలరించారు. విద్యార్థులు ఉట్లను కొట్టారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

రేపటి నుంచి కృష్ణాష్టమి ఉత్సవాలు

చారకొండ: మండలంలోని సిర్సనగండ్ల సీతారామచంద్రాస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 26, 27, 28 మూడు రోజుల పాటు శ్రీకృష్ణాజన్మాష్టమి వేడుకలు నిర్వహిస్తునట్లు ఆలయ చైర్మన్ దేరం రామశర్మ, ఈఓ ఆంజనేయులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 26న శ్రీకృష్ణజన్మాష్టమి ప్రత్యేక పూజ కార్యక్రమాలు, 27 సాయంత్రం ఉట్లు కొట్టుట, పుష్ప రథోత్సవం, 28 శివాలయం, పోచమ్మ గుడి, అనుబంధ ఆలయాలో ప్రత్యేక పూజలు ఉంటాయని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.